ఆరోగ్యకరమైన నారుతో అధిక దిగుబడులు

- నారుమడి ఏర్పాటులో ఆధునిక పద్ధతులు పాటించాలి
- వరినాట్ల సమయంలోనూ జాగ్రత్తలు అవసరం
- వరిపై రైతులకు వ్యవసాయ అధికారుల సూచనలు



వరిసాగుకు సిద్ధం చేసిన నారుమడి



నాట్లు వేస్తున్న కూలీలు

గోస్పాడు: ఆరోగ్యకరమైన వరినారుతో అధిక దిగుబడులు సాధించ్చు. నారుమడి ఏర్పాటు సమయంలోనూ ఆధునిక పద్ధతులు తప్పనిసరి. వరినాట్లు వేసేటప్పుడూ జాగ్రత్తలు తీసుకుంటూ లాభాలు పొందొచ్చని వ్యవసాయ అధికారుల సూచిస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభం కావడంతో రైతులు ఇప్పటికే పలు రకాల పైర్లను సాగు చేశారు. మండల పరిధిలో అత్యధికంగా కేసీ కాల్వ ద్వారా వచ్చే నీటిపై సాగు చేస్తున్నారు. ఇందులో దాదాపు 10వేల ఎకరాలకు పైగా వరిపైరును రైతులు ఏటా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా రైతులు వరిసాగుపై సమాయత్తం కాగా ఇప్పటికే పొలాల్లో కొందరు రైతులు సాలువరి సాగు చేసిన వారు కాగా మరికొందరు వరినార్లు పోసుకొని పొలాల్లో నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. రైతులు ఖరీఫ్ సాగులో భాగంగా వరి నారుమడులను సిద్ధం చేసుకొని నాట్లు వేసేపనిలో ఉన్నారు. సరైన యాజమాన్యపద్ధతులు పాటిస్తే ఆరోగ్యకరమైన నారును పొందటంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చు. వరినారు మడులలో యాజమాన్య పద్ధతులు, విత్తనాల ఎంపిక, భూమి చదును చేయడం, నేల స్వభావం, నీటి లభ్యత, విత్తనశుద్ధి, ఎరువుల మోతాదు తదితర విషయాలపై రైతులు ఎంతో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నారుమళ్లు, ఆకుతీత, వరినాట్లు వేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గ్రామాల్లో గత ప్రభుత్వం నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో సాగునీరు, విత్తనాల లభ్యత తదితర అంశాల ఆధారంగా నారుమళ్లు ఏర్పాటు చేసుకోవడం దగ్గర నుంచి వరి నాట్లు వేసుకునే వరకూ వివిధ దశల్లో వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. వ్యవసాయశాఖ సూచనల మేరకు వరిసాగులో తగిన జాగ్రత్తలు తీసుకుని సమయ పాలన పాటిస్తే నాణ్యమైన పంటలతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చు.

వ్యవసాయాధికారుల మరిన్ని సూచనలు

- వరిపైరుకు సాగుకు ముందు పచ్చిరొట్ట పైర్లు అయిన జనుము, జీలుగ, తదితర పంటలు సాగు చేస్తే భూసారం పెరుగుతుంది.
- సాగుకు ఆసక్తి లేకపోతే ఎక్కువ రోజులు భూమిని ఖాళీగా ఉంచితే భూసారం పెరుగుతుంది.
- ఖరీఫ్, రబీ పంట త్వరితగతిన సాగు చేసుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల నుంచి చీడపీడలు, తెగుళ్ల బారి నుంచి తప్పించుకోవచ్చు.
- ఖరీఫ్ పంట త్వరగా ముగిస్తే రబీ పంట కూడా త్వరగా కోతకు వస్తుంది. దీనివల్ల నీటి ఎద్దడిని అధిగ మించవచ్చు.

నారు మడి మునిగితే ఇలా చేయాలి.

- నారుమడిలో బాటలు వేసి నీటిని తొలగించాలి. మొక్కలు కోల్పోవడానికి ఎకరా నారు మడికి యూరియా, పొటాష్ ఎరువులను 10కేజీల చొప్పున అందించాలి.
- నారుమడికి తెగుళ్ల సోకకుండా లీటరు నీటిలో 2 గ్రాముల కార్బండిజం, 2.5 మిల్లీ గ్రాముల క్లోరోఫైరీపాస్ ద్రావణాన్ని పిచికారి చేయాలి.
- నారుమళ్ల పూర్తిగా దెబ్బతింటే రైతులు ప్రత్యామ్నాయంగా వెదజల్లు విధానాన్ని అవలంభించి సమయం, పెట్టుబడిని ఆదా చేసుకోవాలి.

వరి నాట్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వరి నారుమడి వేసే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి.
- వరినాట్లు వేయడానికి 15రోజులు ముందుగానే పొలాన్ని దమ్ము చేయాలి. టిల్లర్లు లేదా ట్రాక్టర్‌తో పొలంలో నారు వేయడానికి ముందు పొలాన్ని మురుగు దమ్ము చేయాలి.
- పొలంలో 15సె.మీ మించి లోతుగా దమ్ము చేయరాదు. దమ్ము చక్కతో గాని, యంత్ర పరికరంతో గాని పొలాన్ని చదును చేయాలి.
- నారుమడి లేత ఆకురంగులో ఉన్నప్పుడే నాటం ద్వారా త్వరగా పిలక కడుతుంది.
- 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించుకుంటే ఫలితం ఉంటుంది.
- నారు పైపైన ఉండే విధంగా నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంది.
- నారు వేసే టప్పుడు భూసారాన్ని బట్టి పిలకలను నాటాలి.
- వరినాట్ల తర్వాత బాటలు వేయాలి. దీని వల్ల పైరుకు వెలుతురు తగిలి చీడపీడల నివారణకు దోహదపడుతుంది.

వరిసాగుపై అవగాహన అవసరం



రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలి. ప్రస్తుత ఖరీఫ్‌లో విత్తన శుద్ధి ఎంపికతో నారు మళ్ల తయారీ, నాట్లు వేసే సమయంలో మెలకువలు పాటించినట్లయితే ఆశించిన పంట దిగుబడులు పొందవచ్చు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగు మందులు వినియోగించి ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చు.

– స్వప్నికారెడ్డి, ఏఓ, గోస్పాడు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



బసవేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

ఉయ్యాలవాడ: మండల కేంద్రంలో జీర్ణోద్ధారణ గావించిన బసవేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజ, కలశ స్థాపన, మండప ఆరాధన, నవగ్రహ, గణపతి హోమం, రుద్రహోమాలు నిర్వహించారు. సాయంత్రం దాన్యాదివాసం, శయ్యాదివాసం, పుష్పదివాసం, మంగళహారతి, తదితర కార్యక్రమాలు జరిగాయి.

ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు సురక్షితం



తల్లీబిడ్డ ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న డాక్టర్ నాగేంద్ర

దొర్నిపాడు: ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు సురక్షితం అని వైద్యాధికారి నాగేంద్ర సూచించారు. మంగళవారం కోవెలకుంట్ల మండలం భీమునిపాడు గ్రామానికి చెందిన నగీన అనే గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో స్థానిక పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. వైద్య పరీక్షలు చేసిన నార్మల్ కాన్పు చేశారు. అనంతరం శిశువుకు జీరోడోస్ టీకా వేశారు. ఈ ఏడాది మార్చి నుంచి 15 కాన్పులు చేసినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ఆసరా ద్వారా తల్లి ఖాతాలో రూ.5 వేలు జమ చేస్తామన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



కబడ్డీ ఆడుతున్న బాలికలు

దొర్నిపాడు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలను హెచ్‌ఎం శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. పీడీ దేవేంద్ర ఆధ్వర్యంలో బాలబాలికలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్ వంటి క్రీడలను ఉల్లాసంగా ఉత్సాహంగా ఆడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని హెచ్‌ఎం తెలిపారు. క్రీడలు ఏకగ్రతో పాటు మంచి ఉల్లాసాన్నిస్తాయని పేర్కొన్నారు. గెలిపొందిన విద్యార్థులకు గురువారం బహుమతులను అందజేయనున్నట్లు చెప్పారు.


ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చాగలమర్రి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో యూటీఎఫ్ ముందంజలో ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఐజయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని గొడిగనూరు, మద్దూరు, పెద్ద బోధనం, చిన్నవంగలి, చింతలచెరువుతో పాటు చాగలమర్రిలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌలిక వసతులు కల్పించాలని, మండలంలోని అన్నీ ఉపాధ్యాయ సంఘాల సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లాకు వినతి పత్రాన్ని అందజేశారు. యూటీఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి బాబాపకృద్దీన్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు డెన్ని జాన్సన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుగుణశ్రీ

నంద్యాల(అర్బన్): గ్రామాల పారిశుద్ధ్యంపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళవారం నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, మౌలిక వసతుల ఏర్పాటులో జాతీయ జాతీయ స్థాయి అవార్డులు సాధించిన పాండురంగాపురం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

నీటి వృథాను అరికట్టండి



మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): తుంగభద్ర ప్రాజెక్టుపై సాంకేతిక నిపుణులతో తక్షణమే స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకొని పోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యమేనన్నారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ నిర్వాహకులతో పాటు పర్యవేక్షణ సరిగా లేకపోవడం వల్ల రాయలసీమలో అభివృద్ధి చేసిన 20 లక్షల ఎకరాల ఆయకట్టులో కేవలం 8 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు లభించని దుస్థితిలో రాయలసీమ ప్రాంతం ఉందన్నారు. తుంగభద్ర, కృష్ణా నదుల్లో నీరు పుష్కలంగా ప్రవహిస్తున్నా రాయలసీమ ఆ నీటిని వినియోగించుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. రాయలసీమలోని ప్రాజెక్టులు ప్రమాద కరంగా ఉన్నా ప్రభుత్వాలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. నంద్యాల జిల్లాలోని అలగనూరు రిజర్వాయర్ కట్టలకు కోతలు, గోరుకల్లు రిజర్వాయర్ రిబట్‌మెంట్ జారీ పోవడం, వెలుగోడు రిజర్వాయర్ రిబట్‌మెంట్ ఇబ్బందులు, సుంకేసుల నుండి కేసీ ప్రధాన కాల్వ బలహీన పడటం తదితర సమస్యలు ఉన్నాయని అన్నారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టులోని ఎత్తిపోతల పథకాలు, చెరువులకు నీరు అందించే వాగులు కూడా ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. రాయలసీమ సాగునీటి రంగ అభివృద్ధికి రాష్ట్ర సాగునీటి బడ్జెట్‌లో 42 శాతం న్యాయం చేయాలని నాయకులు కోరారు. సమావేశంలో బాబాఫక్రుద్దీన్, భాస్కర్ పాల్గొన్నారు.

రుణాలు మంజూరు

శిరివెళ్ల: స్థానిక కేడీసీసీ బ్రాంచ్‌కు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దీర్ఘకాలిక రుణాల కింద రూ. కోటి మంజూరయ్యాయని బ్రాంచ్ మేనేజర్ రేణుక తెలిపారు. అలాగే గోస్పాడు సహకార సంఘానికి పంట రుణాల కింద రూ.15 లక్షలు మంజూరయ్యాయన్నారు. బ్రాంచ్ టర్నోవర్ రూ. 135 కోట్లు కాగా అందులో వివిధ రుణాలు రూ. 103 కోట్లు, డిపాజిట్ల కింద రూ. 30 కోట్లు ఉన్నాయని పేర్కొన్నారు. తమ బ్రాంచ్ పరిధిలోని సహకార సంఘాల్లో 95 వేల మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. వారందరికీ రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో బ్రాంచ్ ద్వారా రూ. 25 కోట్ల రుణాలును మంజూరు చేయగా రూ. 21 కోట్లు వసూలు అయ్యాయని వెల్లడించారు. అలాగే సహకార సంఘాల ద్వారా రూ. 54 కోట్ల రుణాలు పంపిణీ కాగా రూ. 40 కోట్లు వసూలు అయ్యాయన్నారు. నాబార్డు ఆదేశాల మేరకు సహకార సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియ జరుగుతోందని చెప్పారు. అక్టోబర్ 2 నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యమన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



క్రిష్టయ్య(ఫైల్)

దొర్నిపాడు: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన దొర్నిపాడులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సరేష్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బలిజ బుడ్డ మిద్దె క్రిష్టయ్య(52) మూడేళ్లుగా తనకున్న 1.5 ఎకరాల భూమితో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని విత్తన పత్తి, మిరప పంటలు సాగుచేసేవాడు. తీవ్ర వర్షాభావం వల్ల పంట దిగుబడులు పూర్తిగా పడిపోవడంతో నిరుత్సాహం చెందాడు. పొలం కౌలు, పెట్టుబడుల కోసం రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేననే బాధతో మనస్తాపం చెంది సోమవారం గడ్డిమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొబ్బరి మొక్కల పంపిణీ



కొబ్బరి మొక్కలను ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న రైతులు

చాగలమర్రి: ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటల సాగులో భాగంగా చాగలమర్రి మండలంలోని రైతులకు 1,650 కొబ్బరి మొక్కలను పంపిణీ చేసినట్లు ఏపీఓ నిర్మలాదేవి తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగుకు ఈ ఏడాది 300 ఎకరాల విస్తీర్ణం గల రైతులను గుర్తించాలని జిల్లా అధికారులు ఆదేశించారని, ఇప్పటి వరకు 200 ఎకరాల విస్తీర్ణం గల రైతులను గుర్తించామన్నారు. వారిలో డి.వనిపెంట, ముత్యాలపాడు, కేపీ తండా, మద్దూరు, పెద్దబోధనం గ్రామాలకు సంబంధించి సుమారు 15 మంది రైతులకు 1,650 టెంకాయ మొక్కలను మంగళవారం పంపిణీ చేశామన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ఉద్యాన పంటల సాగుకు గుర్తించిన రైతులకు మల్లె, మామిడి, తదితర మొక్కలను అందజేస్తామన్నారు. నాటిన తరువాత మొక్కల సంరక్షణ బాధ్యత రైతులదేనని తెలిపారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు

నంద్యాల(న్యూటౌన్): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్‌టీఆర్ షాదీఖానాలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ సమర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, తోట మద్దులు హాజరై మాట్లాడారు. మహనీయుల త్యాగాలను మరువరాదన్నరు. కవులను, కళాకారులను, క్రీడాకారులను ప్రోత్సహించడంలో బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గౌస్, వెంకటలింగం, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ, శివమ్మ, వీఓఏల సంఘం జిల్లా కార్యదర్శి తిరుపతయ్య పాల్గొన్నారు.

ఘనంగా అవయవదాన దినోత్సవం



అవయవదాత అంగీకారపత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): అంతర్జాతీయ అవయవదాన దినోత్సవాన్ని శాంతిరాం మెడికల్ కళాశాలలో మంగళవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శాంతిరాం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ అధికారి శారదాబాయి పాల్గొని మాట్లాడారు. శరీరంలోని 8 అవయవాలు దానం చేయవచ్చని, కొన్నింటిని బతికున్నప్పుడు కూడా దానం చేయవచ్చని, మరికొన్నింటిని చనిపోయిన తర్వాత మాత్రమే దానం చేయవచ్చని, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అవయవదానానికి ముందుకొచ్చిన వారికి సర్టిఫికెట్లు అందజేసి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి, ప్రిన్సిపాల్ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్నేషనల్ యూత్ డేను పురస్కరించుకొని సెట్కూరు ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట రూ.2.60 లక్షలు టోకరా

ఉయ్యాలవాడ: ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.2.60 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొండుపల్లె గ్రామానికి చెందిన సిద్దంరెడ్డి వెంకటయశ్వంత్ రెడ్డి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. స్నేహితుల ద్వారా అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం జెంజురామల్లె గ్రామానికి చెందిన క్రిష్ణకాంత్ పరిచయమయ్యాడు. బెంగుళూరులోని ఓ ప్రముఖ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో నమ్మిన వెంకటయశ్వంత్ 2023 మార్చిలో రూ.2.60 లక్షలను బ్యాంకు ఖాతాకు బదిలీ చేశాడు. రోజులు గడుస్తున్నా ఉద్యోగం తీసివ్వలేదు. ఇదిగో అదిగో అంటూ 16 నెలలు కాలయాపన చేశాడు. కనీసం డబ్బులు ఇవ్వమన్నా ఇవ్వకుండా ముఖం చాటేయడంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన శ్రీను

బొమ్మలసత్రం: నంద్యాల శివారులోని ఆటోనగర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళి శ్రీను (38) అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా తెలిపిన వివరాలు.. వైఎస్సార్ నగర్‌లో నివాసముంటున్న శ్రీను శాంతిరామ్ మెడికల్ కళాశాలలో బార్బర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి తిరికి వస్తుండగా లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న కారును ఢీకొని పక్కనే వెళ్తుతున్న ఆర్‌జీఎమ్ కళాశాల బస్సు టైర్ల కింద పడ్డాడు. బస్సు టైరు శ్రీనుపై ఎక్కటంతో తీవ్రరక్తస్రావమై అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ సీఐ ప్రమాదానికి కారణమైన వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

గోస్పాడు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ నాగఅనసూయ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణ, క్షేత్రస్థాయి నిర్వహణ, చెత్త సేకరణ, పొడి చెత్త వేరుచేసే విధానం, వర్మీకంపోస్టు తయారీ విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం క్లాప్ మిత్రలకు చెత్త కేంద్రాల వద్ద అనుసరించాల్సిన విధానాలను వివరించారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లోని కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి శ్రావణమాసం పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళికాంబ మూల విరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలచే పూలంగి సేవా నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాదపద్మారాధన సేవ, మహామంగళ హారతులు ఇచ్చారు. నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయం ఈఓ లక్ష్మీయనారాయణ పాల్గొన్నారు.

జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మునెప్ప

నంద్యాల(న్యూటౌన్): కార్మిక వర్గం కోసం నిరంతరం పోరాడే ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలు సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో విశాఖ పట్నంలోని స్టీల్ ప్లాంట్ నందు జరుగుతున్నాయని, ఈ సమావేశానికి దేశంలోని అన్ని రంగాల నుండి ప్రతినిధులు పాల్గొంటారని, జిల్లాలోని కార్మిక వర్గం జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మునెప్ప, నంద్యాల జిల్లా సీపీఐ కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశం రఘురామ్మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలన్ని ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని అన్నారు. బ్యాంకింగ్, భీమా, రైల్వే, టెలికాం అన్నింటిలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారన్నారు. దీని వల్ల ధని, పేద అంతరాలు పెరిగి పోతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం, ఆశా, అంగన్‌వాడీ స్కూల్ స్కావెంజర్లపై రాజకీయ దౌర్జన్యాలు చేస్తున్నారని, వీటిని ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగిరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ రమేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివబాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు అబ్బాస్, నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, భూమిని శ్రీనివాసులును ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న తెలిపారు. అలాగే అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుశీలమ్మ, తులశమ్మ, మున్సిపల్ నాయకులు వరలక్ష్మి, సుబ్బమ్మ, సునిత, సుజాత పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న విజయరావు

గోస్పాడు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు విజయరావు డిమాండ్ చేశారు. సోమవారం గోస్పాడులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెం.117ను రద్దు చేయాలన్నారు. సర్దుబాటు 2020లో జీవో 53 ప్రకారం చేయాలన్నారు. 70 శాతం అంగవైకల్యం ఉన్న వారికి సర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. నెలవారి పదోన్నతులు ఇవ్వాలని, జీవో నెం.60 మేరకు ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు కృష్ణారావు, షద్రక్‌బాబు, శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి, సికిందర్, ఫరూక్, అహమ్మద్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు





సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ. శ్రీరంగాపురంలో పంట నమోదును పరిశీలిస్తున్న దృశ్యం

రుద్రవరం: సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. రుద్రవరం మండలం శ్రీరంగాపురంలో ఏఓ శ్రీకృష్ణతో కలిసి పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా పంట నమోదును పరిశీలించారు. అనంతరం రైతుల సమావేశంలో పలు సూచనలు ఇచ్చారు. ఈ ఏడాది మండలంలో శ్రీరంగాపురం గ్రామాన్ని పొలంబడి కింద ఎంపిక చేశామన్నారు. గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీస్‌లో భాగంగా సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి అధిక లాభాలు గణించే వివరాలు, పద్ధతులను వివరించారు. పురుగు మందుల అవశేషాలు లేని పంటలు పండించి ఇండిగ్యాప్ సర్టిఫికెట్ ద్వారా అంతర్జాతీయ విఫణిలో అధిక లాభాలు గడించాలని సూచించారు. తహసీల్దార్ మల్లికార్జునరావు, ఏఈఓ రాజు, వీఏఏలు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

చెత్త సంపద కేంద్రాల పరిశీలన



శానిటేషన్ యంత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దొర్నిపాడు: గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసులు, సీఆర్‌పీ బాలంజనేయులు చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. గ్రామాల్లోని చెత్త నుంచి ఏ విధంగా సంపద సృష్టించాలో అవగాహన కల్పించారు. పల్లెలో గ్లౌజులు, డైపర్ వంటి వివిధ రకాల చెత్త వస్తువులు పడేస్తుంటారని వాటిని శానిటేషన్ మిషన్‌లో వేస్తే ఎలా బుడిద అవుతాయనేదానిని పరిశీలించారు. గ్రామాభివృద్ధిలో భాగంగా చెత్తను ఆదాయన వనరుగా ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు నాగార్జున, వెంకటనారాయణ, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.



సర్వాయిపల్లెలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

చెత్త సంపద కేంద్రాలపై అవగాహన

ఉయ్యాలవాడ: గ్రామ పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పంచాయతీకి వనరులు పెరుగుతాయని ఈఓపీఆర్‌డీ మహేంద్రారెడ్డి అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళవారం సర్వాయిపల్లె పంచాయతీలో నిర్మించిన చెత్త సంపద కేంద్రంపై అవగాహన కల్పించారు. ఇలాగే ప్రతి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసుకుంటే గ్రామాలు పరిశుభ్రతతో పాటు పంచాయతీకి ఆదాయం పెరుగుతుందని సూచించారు.

16 నుంచి రెవెన్యూ గ్రామసభలు

గోస్పాడు: ఈనెల 16 నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ మంగళవారం తెలిపారు. 16న కానాలపల్లె, 17న ఎస్.నాగులవరం, 20న రాయపాడు, 21న తేళ్లపురి, 22న ఎం.చింతకుంట్ల, 23న పసురపాడు, 24న సాంబవరం, 27న ఎం.కృష్ణాపురం, 28న జిల్లెల్ల, 29న గోస్పాడు, 30న జూలేపల్లె, 31న ఒంటివెలగల, సెప్టెంబర్ 3న దీబగుంట్ల, 4న ఎస్.కూలూరు, 5న యాళ్లూరు గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భూ సమ్యలను సభల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ

నంద్యాల(వ్యవసాయం): భారత జాతీయ పార్టీ రాష్ట్ర కమిటీ సూచన మేరకు జిల్లా కో ఆర్డినేటర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కల్పనా సెంటర్‌లోని వివేకానంద విగ్రహం వద్దకు చేరుకొని నివాళులర్పించారు.